క్లుప్తంగా

మానసిక వికలాంగుల వార్డు తనిఖీ



వార్డులో వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని దిశ వన్ స్టాప్ సెంటర్, మానసిక వికలాంగుల వార్డులను తనిఖీ చేశారు. రికార్డులు, సౌకర్యాలు, పరిశుభ్రతలను పరిశీలించారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మహిళలు, పిల్లలు, మానసిక వికలాంగులు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులన్నారు. ఆయన వెంట వైద్యులు నాగేశ్వరరావు, గంగాధర్‌నాయక్ ఉన్నారు.

పదోన్నతి పొందిన నర్సులకు క్యాప్ వేడుక



అనసూయమ్మ, రాజ్యలక్ష్మిలను సన్మానిస్తున్న నర్సింగ్ ఆఫీసర్లు

కర్నూలు(హాస్పిటల్): హెడ్ నర్సుల నుంచి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2గా పదోన్నతి పొందిన అనసూయమ్మ, రాజ్యలక్ష్మిలకు మంగళవారం క్యాప్ సెర్మని(వేడుక) నిర్వహించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 వెంకటతులశమ్మ వారికి క్యాప్‌లను తొడిగారు. కాగా వీరిద్దరూ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2లుగా పదోన్నతులు పొంది త్వరలో ప్రారంభం కానున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో వీరిని హెడ్ నర్సులు, స్టాఫ్‌నర్సులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు ఉమాదేవి, లీల, రమణమ్మ, ఆదిలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు.

కొత్త రైల్వేలైన్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి



రైల్వేస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు సంబంధించి కొత్త రైల్వేలైన్లు, కొత్త రైళ్ల కేటాయింపు కోసం కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కర్నూలు ఆంధ్ర రాష్ట్రానికి మొదటి రాజధాని అయినా నేటికీ వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు రైళ్ల సదుపాయం లేదన్నారు. కర్నూలు నుంచి మంత్రాలయం, నంద్యాలకు నేరుగా కొత్త రైళ్ల మార్గాలను నిర్మించేందుకు నిధులు కేటాయించాలన్నారు. ఎంపీలు కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే రద్దు చేసిన రాయితీ పాసులను పునరుద్ధరించాలన్నారు. నాయకులు నిర్మల, రాధాకృష్ణ, నారాయణ, రాముడు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని వరల్డ్ లెప్రసీ డే సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో స్థానిక అభయగిరిలో కుష్టు రోగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు దామర ప్రభాకర్ మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిపై అవగాహన అవసరమని తెలిపారు. రాఘవేంద్రశెట్టి, మాణిక్యప్రభు, వెంకటేశ్వర్లు, నాగరాజు గుప్త, పీవీ రాజ్‌కుమార్, లోకేష్, దుర్గా నాగేశ్వరరావు, డాక్టర్ బాలమద్దయ్య, రామరాజ్, రమణగౌడ్, శ్రీనివాసబోస్, పాండురంగారెడ్డి, శివరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

సెలవులో డీసీపీ మోహన్ కుమార్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఇప్పటికే ఇదే విభాగంలో పనిచేసే సిటీ ప్లానర్ సెలవులో వెళ్లిపోగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న హరీష్ చౌదరి అనంతపురం– హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ అయ్యారు. రెండు రోజుల క్రితం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్వీ.శివారెడ్డి, నగర పాలక కార్యదర్శి షేక్ మాలిక్ బదిలీపై వెళ్లారు. దీంతో అనేక కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామ స్వరాజ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య
- వాడవాడలా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్లే గ్రామ సుపరిపాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై.రామయ్య అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలన గ్రామ స్థాయిలోనే అందించాలన్న గాంధీ ఆశయాలను ముఖ్యమంత్రి నేరవేర్చారన్నారు. గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి స్థానికంగానే ప్రభుత్వ పాలన అందించారన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ సామాజిక విప్లవం తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, అంబేడ్కర్ ఆశయాలు సీఎం నెరవేర్చారని తెలిపారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. జగనన్న వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పార్టీ నాయకులు బత్తుల లక్ష్మీ కాంతయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

నగరపాలకలో..

నగరపాలక కౌన్సిల్ హాలులో కమిషనర్ భార్గవ్‌తేజ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ ఆశయాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగరపాలక మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

గాంధీ మార్గం ఎన్నో సమస్యలకు పరిష్కారం

కర్నూలు(సెంట్రల్): అహింసావాది మహాత్మాగాంధీ అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలో నేడు చిన్న వివాదాలకే హత్యలు, ప్రతీకారాలకు దారితీస్తున్నాయని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. గాంధీ చూపిన అహింసా మార్గంలో నడిస్తే ప్రతి సమస్యకు శాంతి పూర్వకంగా సమాధానం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఉండవెల్లి వెంకటన్న, దామోదరం రాధాకృష్ణ, బతుకన్న, సత్యానారాయణగుప్తా, ఎస్.చంద్రశేఖర్, ఎస్.ప్రమీల, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలి

కర్నూలు(హాస్పిటల్): మహాత్మాగాంధీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారపేటలో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో హింసాత్మక పద్ధతుల్లో దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్న సందర్భాలు ఉన్నాయని, అందుకు భిన్నంగా అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యం సాధించుకోవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారన్నారు. భారతీయ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడం గాంధీ వల్లే సాధ్యపడిందని కొనియాడారు. నిజం పలకడం, అహింసా విధానం అవలంబించడం వంటివి నిజమైన ఆయుధాలని ఆయన నిరూపించారని తెలిపారు.

జాతిపితకు నివాళి

కర్నూలు కల్చరల్: జాతిపిత మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీక్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నాగస్వామి నాయక్ అన్నారు. మంగళవారం గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శాంతి, అహింస గాంధీజీ నమ్మే సిద్ధాంతాలని తెలిపారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో నేటి యువత నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, విజయశేఖర్, జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, పార్థసారథి పటేల్, సోమేష్, గిరిజారాణి, చిన్న మల్లేశ్వరుడు పాల్గొన్నారు. అలాగే నగరంలోని ఎ.క్యాంప్‌లో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాలలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ జె.రవికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కాసర్ల సురేష్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రెండు వారాల్లో నివేదిక సమర్పించండి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ సృజన





సమావేశంలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని, హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): మెగా సోలార్ పవర్ కార్పొరేషన్ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి, ఖర్చుల వివరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన మెగా సోలార్ పార్కు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. రెండు వారాల్లోగా మెగా సోలార్‌పవర్ కార్పొరేషన్ ద్వారా చేసిన పనులపై యుటిలైజేషన్ సర్టిఫికెట్లతో సహా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రీన్ కో, అదానీ కంపెనీల వార్షిక టర్నోవర్ ప్రకారం 2017–18 నుంచి 2023 వరకు సామాజిక బాధ్యతగా 5 శాతాన్ని లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్‌కు కేటాయించగా..ఆ నిధులతో పార్కింగ్, స్వచ్ఛ భారత్, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, తాగునీటి వసతి, హంద్రీ–నీవా కాలువ శుభ్రత తదితర పనులకు వినియోగించారన్నారు. సీపీఓ హిమ ప్రభాకరరాజు, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, ఏపీఎస్ఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ, సోలార్ పవర్ కార్పొరేషన్ ఇంజినీర్ ఆంజనేయులు, నాగరాజు, గ్రీన్‌కో ఏజీఎం చెంచయ్య, డీఎం శివకుమార్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్లు చేసిన వైద్యులకు సన్మానం



న్యూరోసర్జరీ విభాగం వైద్యులను సన్మానిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్సలు చేసిన వైద్యులను మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఘనంగా సన్మానించారు. ఇందులో న్యూరోసర్జరీ విభాగం నుంచి డాక్టర్లు రామబాలాజీనాయక్, మోహన్‌శాంక్, యురాలజీ– సీతారామయ్య, నెఫ్రాలజీ– అనంత్, అనెస్థీషియా–విశాల, జనరల్ సర్జరీ విభాగం నుంచి హరిచరణ్, రామకృష్ణనాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హెచ్ఓడీల సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ అమలు లక్ష్యాలను అధిగమించిన కార్డియోథొరాసిక్, పల్మనాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల వైద్యులను అభినందించారు. ఆరోగ్యశ్రీ కేసులు తిరస్కరణకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ–హాస్పిటల్ అమలు కూడా బాగా చేస్తున్నారని కొనియాడారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్లు రాధారాణి, ఇక్బాల్ హుసేన్, శ్రీనివాసులు, ఆర్ఎంఓ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో సర్వే నంబర్ 556/ఏలో అక్రమంగా గ్రావెల్ తవ్వి గాలిమరల మధ్య రహదారి నిర్మాణం కోసం తరలించిన అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. గోరంట్లలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో సంబంధిత ప్రాంతాన్ని మైనింగ్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డీడీ మాట్లాడుతూ.. అక్రమంగా ఖనిజాన్ని తవ్వి తరలించారని, సంబంధిత ప్రాంతాన్ని తనిఖీ చేసి కొలతలు తీసుకున్నామని, తుది నివేదిక రూపొందించి అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

8న కర్నూలులో బాలోత్సవం



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ఫిబ్రవరి 8,9 తేదీల్లో బాలోత్సవం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ ఉపాధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో కలెక్టర్ జి.సృజన బాలోత్సవం లోగోను ఆవిష్కరించారు. ఓబులయ్య మాట్లాడుతూ.. నగర శివారులోని ఇండస్ మాంటిస్సోరి పాఠశాలలో బాలోత్సవం నిర్వహిస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమంలో నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుతారన్నారు. పీవీబీ సుబ్బయ్య, జేఎన్ శేషయ్య, వాసుదేవయ్య, జయరాజు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ ఈఆర్ఓ, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. మంగళవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల, కల్లూరు, ఓర్వకల్ మండలాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకోవడానికి అనువుగా భవనాలను పరిశీలించారు. వర్షం వచ్చినా లీకులు కాకుండా ఉండాలన్నారు. రూట్ల వారీగా పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాలు నిలుపుకోవడానికి, పోవడానికి అనువైన రహదారులు, ఇతర నిర్మాణాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు ఉన్నారు.

అంతర్ జిల్లాల హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న సబ్ జూనియర్ అంతర్ జిల్లాల హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర హాకీ సంఘం అధ్యక్షుడు చాణక్యరాజు, జిల్లా కార్యదర్శి సుధీర్, నిర్వహణ కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కర్నూలు: కర్నూలు–డోన్ జాతీయ రహదారిపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శరీన్‌నగర్‌కు చెందిన దూదేకుల ఆలం బీ (78) మృతిచెందింది. అబ్బాస్ నగర్ వైపు నుంచి శరీన్ నగర్‌కు వెళ్లేందుకు మంగళవారం ఉదయం రోడ్డు దాటుతుండగా డోన్ వైపు నుంచి కర్నూలుకు వస్తున్న బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టడంతో ఆలం బీ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మృతిచెందింది. ఈమె భర్త, కూతురు కూడా చనిపోవడంతో మనవడి దగ్గర ఉంటూ బొరుగులు అమ్ముకుని జీవనం సాగించేది. మనవడు దస్తగిరి ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ కటారుకొండ గ్రామానికి చెందిన ఎల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయండి

- డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31.59 కోట్లను మార్చి నెలాఖరు నాటికి ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు ఆదేశించారు. ఈ నిధులను నిర్ణీత సమయంలోగా ఖర్చు చేస్తే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్ నుంచి జిల్లాలోని ఈఓఆర్డీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్యం అవసరాలకు వెచ్చించిన ఖర్చుతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు ఈ నిధులను ఉపయోగించుకోవాలన్నారు. అలాగే గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం చేపట్టాల్సిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో పన్ను వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ. 24.12 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.6.19 కోట్లు మాత్రమే వసూలు అయ్యిందన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎలక్టోరల్ నమోదు అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎలక్టోరల్ నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సెక్టోరియల్ ఆఫీసర్లు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్‌కు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే గుర్తించిన పోలింగ్ స్టేషన్లలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్ విజయశ్రీ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రం గణనీయ ప్రగతి సాధిస్తోంది



మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రాష్ట్రం గణనీయ ప్రగతి సాధిస్తోందని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం వర్సిటీలోని సెనేట్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిపై చర్చా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వీసీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఐరాల లోకానందరెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత ఫలాలు సాధారణ రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విత్తనం నాటే దశ నుంచి పంటను మంచి ధరకు విక్రయించే వరకు ఏపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచడంలో సహాయ సహకారాలు అందిస్తోందని కొనియాడారు. బెంగళూరు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ఆచార్యులు టి. వెంకట సాయి శశిధర్ మాట్లాడుతూ.. ఏపీలో ప్రజా పంపిణీ వ్యవస్థ బాగుందన్నారు. పేదలకు సన్నబియ్యం ఇంటి వద్దే పంపిణీ చేయడం దేశంలోనే మొట్టమొదటి వినూత్న కార్యక్రమం అన్నారు. వర్సిటీ ఎంబీఏ విభాగాధిపతి ఆచార్య సి. విశ్వనాథరెడ్డి, రెక్టార్ ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుందరానంద పుచ్చ, పాలక మండలి సభ్యులు ఎన్.టి.కె.నాయక్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిలో జల్ జీవన్ మిషన్

కర్నూలు(న్యూటౌన్): జల్‌జీవన్‌మిషన్ పనుల నిర్వహణకు గ్రామ స్థాయిలో జల సంఘాలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతి ద్వారా పనులు చేస్తామని కర్నూలు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి తెలిపారు. ప్రతి ఇంటికి కొళాయిని ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. మంగళవారం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జల్‌జీవన్ మిషన్ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ జల సంఘంలో 9 మంది డ్వాక్రా మహిళలు సభ్యులుగా, ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి ఎక్స్ అఫీషియోగా కమిటీని ఏర్పాటు చేసి జల జీవన్ మిషన్ పనులు జరుగుతాయన్నారు. సదస్సులో ఈఓఆర్డీ అనురాధ, జల్ జీవన్‌మిషన్ జిల్లా సమన్వయకర్త భీమశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

58 కేజీల వెండి పట్టీలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న వెండి పట్టీలతో పోలీసులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు 58.565 కేజీల వెండి కాళ్ల పట్టీలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలను మంగళవారం రాత్రి మీడియా ముందు ప్రదర్శించారు. స్టేషన్ సీఐ వివరాలను వెల్లడించారు. మంగళవారం బళ్లారి చౌరస్తా వద్ద ఒక వ్యక్తి రెండు బ్యాగ్‌లతో అనుమానాస్పందగా తిరుగుతున్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ సునిల్‌కుమార్, సిబ్బందితో కలిసి అక్కడి వెళ్లామన్నారు. బ్యాగ్‌లను తనిఖీ చేయగా 9 ప్లాస్టిక్ కవర్లలో వెండి కాళ్లపట్టీలు ఉన్నాయన్నారు. అతన్ని విచారించగా తమిళనాడు రాష్ట్రం సెవ్వాపేట్ టౌన్ సాంబలింగమూర్తి నగర్‌కు చెందిన జగదీష్ (29)గా తెలిసిందన్నారు. తాను, తన తల్లి సేలం టౌన్‌కు చెందిన బంగారు షాప్‌ల వద్ద వెండిని తక్కువ ధరకు కొని ఆభరణాలుగా తయారు చేసి బిల్లులు లేకుండా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని దుకాణాలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. మంగళవారం సేలం నుంచి కర్నూలు వచ్చారని పేర్కొన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద బస్సు దిగి కర్నూలులోని బంగారు షాప్‌లకు వెళ్లడానికి ఆటో కోసం వేచి చూస్తుంటే పోలీస్‌లు రావడంతో పారిపోతుండగా పట్టుకున్నామని వెల్లడించారు. వాటి విలువ రూ.45.33 లక్షలు ఉంటాయని సీఐ తెలిపారు.

సెపక్‌తక్రా సౌత్ ఏషియన్ పోటీలకు ఎంపిక



శివకుమార్

కర్నూలు (టౌన్): నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 31వ తేదీ నుంచి జరగనున్న సెపక్‌తక్రా సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీలకు కర్నూలు నగరానికి చెందిన శివకుమార్ ఎన్నికయ్యారు. ఇతడు 2023లో ప్రపంచ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి ఏషియన్‌గేమ్స్‌లో భారత జట్టులో స్థానాన్ని దక్కించుకున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రబీ సాగుపై అవగాహన కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నీటి వనరుల కింద సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని సబ్ డివిజన్‌ల ఏడీఏలు పాల్గొన్నారు. బోర్లు, కాల్వల కింద వరి, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పంటలు సాగు చేశారని.. రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు.